# హోమాగ్ని

గోపరాజు నాగేశ్వరరావు

దూరం నించి ఆ రెండు కొండలూ ముదరు బూడిదె రంగులో హుందాగా కనిపిస్తో న్నాయి.

ఆ నునుపు కొండల చుట్టూ నిర్వి రామంగా పచ్చటి పొగల్ని ఊదుతోన్నట్టున్న విశాలమైన పచ్చిక బయళ్ళు, చూపు దూరం పారే కొద్దీ చిక్కబడి చీకట్ని పిండుతోన్నాయి అనంతంగా !

నేనూ, ప్రతిమా పచ్చిక బయళ్ల మధ్య నించి నడుస్తోన్నాం.

అక్కడక్కడా పచ్చిక బయళ్ల మీద నీలం రంగు గడ్డి పూలు, పళ్లెంలో పోసిన పచ్చల పొడి మధ్యని ఇంద్రనీలాల్లా మెరుస్తో న్నాయి.

పచ్చిక బయళ్లు దాటి, కొండ వాలుకు చేరుకున్నాం. బల్లపరుపుగా ఉన్న ఓ కొండ రాయి మీద కూచున్నాం.

రెండు క్షణాలు సేద దీరి, ప్రతిమ ముఖంలోకి నింపాదిగా చూసేను.

చమ్మ విడుస్తోన్న ముఖం మీది చమట చుక్కల్ని పైట కొంగుతో సుతారంగా చెరుపుతోంది ప్రతిమ.

ప్రియుడిగా ఆమెతో నా అనుబంధమే ఒక విచిత్రం !

ప్రతిమ అందగత్తె కాదు. వివశత్వంతో వెర్రిగా ఆరాధించేంతటి ప్రత్యేకత కూడా ఆమెలో లేదు.

అదో పరిపూర్ణాకృతి దాల్చని అసంపూర్ణ చిత్రం !

శిల్పీకరించేందుకు ఎంచుకున్న నాణ్య మైన శిల మొత్తం ఎద పొంగుల చిత్రణకే సరిపోయిందేమో ! ఒక్క ఛాతీ తప్ప పొందిగ్గా అమరిన మరే అవయవమూ లేదు ఆమె శరీరంలో.

ఎంత కారు నలుపో ...

శాపగ్రస్తమై, బొగ్గు గని పొరల్లో నిక్షిప్తమై, సుదీర్ఘ కాలపు శిక్షఅనంతరం దిగ్గున లేచి, బద్ధకంగా వొళ్లు విరుచుకు నించున్నట్టు !

అయినా, కారు మబ్బుల అంచున చిట్లి జ్వలించే కాంతి పుంజాల్లా ఆమె చుట్టూ వలయంలా ఏదో వింత కాంతి. తటిల్లతలా మెరిసి, మనసుకు పట్టే వింత మెరుపు ఆ కళ్లలో

ఆ కళ్లు శాసిస్తాయి.

కొలిం పేర్చి కోర్కెల అగ్నిని జ్వలింపి స్తాయి.

అన్నింటినీ మించి, ఆమె నడకలో ఏదో నిర్లక్ష్యం !

ఆమె పట్లనా ఆకర్షణకు అంత కన్నా మరేం కారణం కావాలి ?

మేం కూర్చున్న బండ మీద వేల్తో సున్నాలు చుట్టి, ఆర్తిగా నా వైపు చూసి, చిర్నవ్వు నవ్వి - నా పెదాల మీద చూపుడు వేల్తో రాసి, - లేచి నించుంది ప్రతిమ.

కదిలి, పదడుగులు ముందుకు వేసి, క్రిందికి తొంగి చూస్తో వనకన్య శిల్పంలా నించుంది.

ఆమె అంటించి వెళ్లిన వేలి స్పర్శ నా పెదాలకు లేపనంలా చల్లగా తగిలి - గిలి గింతలు పెట్టి ; నా శరీరం లోకి జారి ఇంకి పోతో నిలువెల్లా దహిస్తోంది నన్ను.

నరాల్లో ఏదో మధురంగా బాధ !

రక్తం వెంటే ప్రవహిస్తో, నాలోని అణు వణువూ దివ్యత్వం పొంది అంతదాకా స్పష్టా స్పష్టంగా ఉన్న కోర్కె గడ్డ కట్టి, ముద్దలా మనసును బరువెక్కిస్తో ...

లేచేను !

నిద్రలో లా నడిచి, ప్రతిమ పక్కనే అంటుకుని నించున్నాను.

ఏదో పరిమళం !

ఆమె శరీరంలోంచి, మగతను కమ్మిస్తో ...

. నా తొందర పాటునూ, వెంపర్లాటనూ, - ఆమె గ్రహించ కూడదన్న ఆలోచనతో, దిగ్గున తలదించి - భయాన్ని అదుపు పుచ్చుతో -

అది నా ఔన్నత్యమని, ఆమె అనుకోవా లని నేననుకుంటో ....

ప్రతిమ ఫక్కున నవ్వింది.

కొండల కింద ప్రకృతి కన్య ఎద పొంగుల మధ్యని యిరుకు లోతట్టుకుండా జాలువారే సన్నటి నీటి పాయ, సాయంకాలపు నీరెండకు జల్లరించిన వెండి మొలతాడు లా మెరుస్తోంది, -

మగతగా కళ్లు మూసుకుని, మనో నేత్రంతో భవిష్యద్దర్శనం చేస్తోన్న రుషి ధ్యానానికి మల్లే మౌనంగా సాగిపోతో ...

ఆ నీటి పాయనే పొడిచి, పొడిచి చూస్తోన్న ప్రతిమ నడుం మీద చెయ్యివేసి - గిర్రున తిప్పి - సందిట్లో యిముడ్చుకుని ఎముకలు కలుక్కుమనేంత దాకా బంధించా లన్నంత కోర్కె !

చెయ్యి చాచేను.

భయమేసింది.

"ఆ నీటి పాయ అందంగా ఉంది కదూ ?" - ప్రతిమను అందుకోవాలని పైకి లేపిన చెయ్యిని లోయ వేపుకు దిశ మార్చి చూపుతో అడిగేను.

గ్రహించింది ప్రతిమ !

ఫక్కున నవ్వింది - గాజు బుడగ పగిలినట్టు !

తలదించుకుని - స్వర్గ లోకపు వ్యభిచారిణి బారిన పడిన మునిలా శీల సంరక్షణార్థం ; పొంగుతోన్న కోర్కెల గొంతు నొక్కి, మర్యాదస్తుడికి మల్లే దూరంగా జరిగేను - వికారంగా ముఖం పెట్టి.

వేసవి సాయంకాలం ....

మనిషి మనసుకు మల్లే ప్రకృతి క్కూడా కాస్తింత చంచలత్వం ఉందేమో !

గెరిల్లాల్లా క్షణంలో ఆకాశం నిండా ముసిరేయి కారు మబ్బులు !

అంతదాకా సెగలూదిన వాతావరణం చల్లబడి, నూగుల్లా సన్నటి చినుకులు పడుతోన్నాయి.; ఆకాశం నించి మంచు రజను జార్తోన్నట్టుంది !

వానలో తడవ కూడదనిపించలేదు.

తడవాలనిపించింది కూడా !

తడుస్తో, నీటి పాయ గిలిగింతలు పెడుతోంటే గమనిస్తోన్నాను.

ఉలిక్కిపడి, ధ్యానం నించి బయటికి గెంతి, - నా వీపుకు తన ఛాతీని దట్టిస్తో - నా శరీరంలోని అణువణువు నూ ఆబగా స్పృశిస్తోన్న ప్రతిమ చేతుల్ని నా చేతులతో లాగి - విసిరి కొట్టేను.

ప్రతిమ కనురెప్పలు బరువుకు వాలి పోతోన్నాయి !

కుంకుమ పొడి అద్దినట్టో ఆమె ముఖం జ్వలిస్తోంది.

పాము బుసలా ఊపిరి పీల్చి వదుల్తో "తప్పు ప్రతిమా !

మనసును నిగ్రహించుకోవాలి" అన్నాను మందలింపుగా.

ఆలస్యం జరిగితే నిగ్రహ పల్లేనన్న భయం నాకుంది గా !

ఆకాశం నించి కారు మబ్బులు నిష్క్రమించేయి.

ప్రకృతి తెల్లటి కాంతిలో ములుగుతోంది.


వాన ఎప్పుడు ఆగిందో కానీ, తేమ గాలి వీస్తోంది.

నన్నో గ్రహాంతర వాసిని చూసినట్టే చూస్తో -

"ప్రకృతి ధర్మానికి భిన్నం కాదే" అంది ప్రతిమ.

"వివాహం కాకుండానా, ఛీ ... ఛీ" అన్నాను - నీతి చెప్తో బోధకుడి స్థానంలో నాకు నేనే పీఠం వేసుక్కూచుని అన్నాను మందలింపుగా..

భళ్లున నవ్వింది.



మరింత దగ్గరగా జరిగి - తన మేని సుగంధాలతో నన్ను వేడెక్కిస్తూ -

"అధర్మం అనుకునే దాన్నే అమలు పరిచే అవకాశం కోసం వెంపర్లాడుతో ఆ కాపట్యాన్ని 'నీతి' అనుకోటం నాకు పరమ అసహ్యం" - అని, - ఎగసిపడుతోన్న వక్షం మీద రెండు చేతుల్నీ 'ఎక్స్'లా బిగించి, అన్చి పెట్టి; నన్ను అమాంతం ఆత్రంగా మింగివేసేట్టు ప్రేమతో క్రూరంగా చూసింది ప్రతిమ !

పచ్చిక బయళ్ల తలలు నిమిరి వస్తోన్న చల్లగాలిలో వొళ్లు పులకరింతలు పడుతోంది.

నీట తడిసిన నీలం గాజు పళ్లెంలా ఆకాశం నిర్మలంగా మెరుస్తోంది.

క్షణం ఊహల్లో తేలి, సంబాలించు కుంటో అన్నాను" వివాహం తంతు అందుకే. విశృంఖలత్వాన్ని నిరోధించేందుకు పెద్దలు ఆ నియమం పెట్టేరు" అడిగింది ప్రతిమ, "కార ణాంతరాల వల్ల భార్యాభర్తలు దూరమైతే !"

"మళ్ళీ కలవచ్చుగా"

"ఆలస్యమైతే ?"

"నిగ్రహ పడాలి"

"ఎంతదాకా ?"

"అవకాశం కల్గేంత దాకా"

"అవకాశం ఆలస్యమైతే ?"

"నిగ్రహించుకో వాలిగా మరి "

"నిగ్రహించుకోలేక పోతే ?"

"ని ... ని.. నిగ్రహించుకోవాలంతే"

"నిగ్రహించుకోటంలో ఆలస్యం జరిగితే ?" అనర్థం జరుగుతుంది"

"తక్కున నిగ్రహించుకోవాలంటే అందుకు చాలా తపస్సు అవసరం"

"ఆ ... అంతే మరి"

"అలా తపస్సు చేసి, బలవంతంగా నిగ్రహ పడేకన్నా ప్రకృతి ధర్మాన్ని పాటిస్తే నేం ?" సూటిగా అడిగింది ప్రతిమ.

ప్రతిమను ఆశ్చర్యంగా చూసేను, అంతరిక్షంలో కొత్త గోళం చూసినట్టు !

వక్షం మీంచి చేతులు విడిపడ్డాయి. నాకేసి జరుగుతోంది ప్రతిమ.

"నీది వితండవాదం" చలించి పోతోనే అన్నాను.

"పాత భావపు కుదుళ్లు కదిలించే ఏ కొత్త వాదనైనా వితండం గానే తోస్తోంది ఆదిలో. అనంతరం అది నిజమని రుజువై ఆధారంగా మార్తుంది. మరో కొత్త వాదం మొదలౌతుంది. మళ్లీ రాళ్లు పుచ్చుకుని దాని వెంట పట్టం మినహా మనుషులకు మరో పన్లేదు" అని - నవ్వి - నవ్వాపి, పూర్తిగా దగ్గరికి జరిగి, నన్నంటుకుని పోతో -

నా రెండు చెవుల్నీ చేతుల్తో మూసి, నాముఖాన్ని ముందుకు లాక్కుని - పెదాలతో అద్ది, - నాలుక కొనతో సుగంధాలను పులిమి నా పెదాల తడి మెరుపు ఇంకి ఆరక ముందే -

తమకంతో తెరిపిడి పడని నా కళ్లనూ, కంపించి పోతోన్న నా బుగ్గల్నీ పెదాలతో పరామర్శించి -




ఈ మైనం కరిగేందుకు ఆ వేడిమి చాలన్నట్టో - చెవుల మీంచి చేతుల్ని తీసి - అమాంతం నన్నల్లుకుని పోయింది ప్రతిమ.

మరేదో లోకంలోకి జారిపోతో, వివ శత్వంలో తేలి, సోలి పోతో - ఇందాక మేం కూచున్న బండ దగ్గరికి నడిపించింది నన్ను.

వెల్లేం.

పెనుబాముల్లా వాలేం.

నా శరీరాన్ని శ్రుతి చేస్తోంది ప్రతిమ, అణువణువూ గాలిస్తో.

భూమికీ, ఆకాశానికీ మధ్య నడిమి కొండ మీద - ఆ బండ మీద - మేమిద్దరం తప్ప సృష్టిలో మరెవ్వరూ లేరు లేరంటో - భయం బుడగలా పేలిపోయి - ధైర్యం ఆవహించి - దూది పింజలా తేలిపోతో - మగతగా, సంధిప్రేలాపనకు మల్లే -

"ప్రతిమా ! నా జీవిత పరమార్థమా ! నీ అడుగుల్లోనే నడుస్తో, నీ హృదయపు కవాటపు టెముకల జయిలు కటకటాల్లో బందీనై ; నా జీవితం నీకు అర్పితం కానీ .

ఓ నా ప్రేమ రసాధి దేవతా ! ఘనీభ వించిన నీ స్నిగ్ధ సౌందర్య మనలేని - లాలిత్యం కాని; - నాకు మాత్రమే కనిపించే నీలోని ఆకర్షణ !

సుడిగాల్లో పూలతలా వొంపులు తిరు గుతో నిర్విరామంగా తపన పడుతోంది.

అలసి, నీరసించి ? పరిమళాల చిరు చమటలు వళ్లంతా పొడిచి -

ఎద మీంచి నన్ను వెల్లికితలా పొర్లించి, నా మీదికి దొర్లి - నత్తలా వొంగి - గువ్వలా నా గుండె మీద ముడుక్కుంది మౌనంగా -

కాలం నిశ్శబ్దంగా ఒక్కో మెట్టే ఎక్కు తో -

తుఫాను అనంతరం ప్రశాంతతలా ..

"ప్రతిమా ! క్షమించు" అన్నాను.

నిజానికి నాకిప్పుడు నరాల్లో మలినా ల్నంటినీ పిండి పారబోసి నన్ను ఆరోగ్య వంతుణ్ణి చేసినంతగా నాలో ఏదో విశ్రాంతి !

"క్షమించనా .. ఎందుకూ ?" అడిగింది ప్రతిమ.

"నిగ్రహించుకోలేక పోయాను"

కిల కిలా నవ్వింది ప్రతిమ.

ప్రతిమకు ఈ రోజు చెప్పాలనుకున్న విషయం జ్ఞాపకం వచ్చింది.

ఆ విషయం చెప్తే ప్రతిమ నేలమీద కుప్పకూలి పోవచ్చు ! గాయాలు కాకుండా ఆమెను పొదివి పట్టుకుందికి సిద్ధపడుతో -

"క్షమించు ప్రతిమా ! మా వాళ్లు నాకు సంబంధం చూసేరు. త్వరలోనే పెళ్లి కూడా .."

"చాలా సంతోషం" అంది ప్రతిమ.

ఎంత నిర్లక్ష్యమో !

ఏ కొద్ది పాటి బాధ ఆమె గొంతులో ధ్వనించినా బావుండేది !

ఆకాశం భూమిని కౌగిలించు కున్న ఆవలి అంచునించి శూన్యం గుండా తేలివస్తే ఏదో విషాదం గుండెను తాకి తొలుస్తోంది, మెత్తగా - నిశ్శబ్దంగా !

భూమ్యాకాశాల కలయిక ఓ చిత్రమైన దృశ్య భ్రమ. ప్రతిమ దృష్టిలో విషాదమూ అంతేనా ?

"పెళ్లితో నాకు నువ్వు దూరమై పోతావుగా. ఎలా భరించగలను ఆ ఎడబాటు?' ' అడిగేను ప్రతిమ కళ్లలోకి చూస్తో.

"ఎడబాటెందుకు. జీవితాంతం స్నేహం చెయ్యొచ్చుగా. సెక్సు జీవితంలో ఒక భాగము మాత్రమే. అదే పరిపూర్ణ జీవితం కాదు"

"అప్పుడు నీకు 'క్యారెక్టర్'లే దంటారు"

"ఉందో, లేదో నాకు తెలిస్తే చాలు" - అని, పల్చగా నవ్వింది ప్రతిమ. సమాధానం దొరకని ఓటమిని అంగీకరించ లేక, ఉద్రేకం పూన్చుకుని - మనసులోని మాటను తెగేసి చెప్పేను - ఉదారంగా -

"ఎవర్నయినా నువ్వూ పెళ్లి చేసుకో. అవకాశం వచ్చినప్పుడల్లా మనం

కలవచ్చు ..."

అంతే ...

'నీడ కాదది పాము పడగ నీడ' అన్నంతగా విస్మయ పడి, దిగ్గున పైకి లేచి నించుంది ప్రతిమ.

అప్పుడు ఆమె కళ్లలో కనిపించింది కోపమో, కక్షో, జాలో, క్షమో, - ఏమో !

"ఛీ ..." అని, గిర్రున వెనక్కు తిరిగి, రివ్వున పోబోతో - ఆగి, - నా వైపుకు తిరక్కుండానే -

"పునీతం అయ్యేందుక్కూడా అర్హం కానంతగా మురిగిపోయేవు" అని, అడుగు ముందుకు వేసేందుకు భూమ్మించి పాదాన్ని పైకెత్తగానే -

ఆత్రంగా "ప్రతిమా ... ప్లీజ్!" అన్నాను.

వింటేనా ?

జర జరా కొండ దిగి, పచ్చిక బయళ్ల గుండా నడిచి - ప్రకృతి పరదాల్లో అదృశ్యమై పోయింది ప్రతిమ.

ఆ నడకలో ఎంత నిర్లక్ష్యమో !

ఆ నిర్లక్ష్యమే కదా, ఆమె పట్లనా ఆకర్షణకు కారణం.

ఒక్క క్షణం నా మనసులో మహోన్నతంగా ఎదిగి, మెరిసి, -

స్మృతి పథంలోంచి అంతలోనే చెరిగి పోయింది ప్రతిమ !

చీకట్లు కమ్ముతోన్నాయి ...

మళ్లీ నూగుల్లా చినుకులు ...

ఇంటికి బయలుదేర్తో మనసులోనే అనుకున్నా -

'అయినా ఇంత బరి తెగించిన పిల్లతో చాలా కష్టం. హమ్మయ్య ! వదిలి పోయింది' అని.

ఇప్పుడెంత హాయిగా ఉందో 'సంసార పక్షంగా !

✤



విజయవాడలో జరిగిన సభలో అంజలి పత్రిక సంపాదకులు శ్రీ కొల్లూరిని సత్కరిస్తున్న శ్రీ చెన్నూరి కుమారాకర్.